క్లుప్తంగా

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని బ్యాంకు ఏరియాలో నెల రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో చెన్నూర్, మంచిర్యాల ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. బోరుకు అమర్చిన విద్యుత్ మోటర్ కాలి పోయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

రుద్రసహిత చండీహోమం



మంచిర్యాలఅర్బన్: స్థానిక గౌతమినగర్ కోదండ రామాలయంలో సోమవతి అమావాస్య సహిత మూలనక్షత్రంను పురస్కరించుకొని సోమవారం రుద్రసహిత చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సాయికుమార్, రామ్మోహనచార్యుల పర్యవేక్షణలో చండీహోమం నిర్వహించగా భక్తులు తరలివచ్చారు.

శివాలయంలో లలితా పారాయణం

చెన్నూర్: చెన్నూర్ శివాలయంలో సోమవతి అమావాస్య సందర్భంగా మహిళలు లోక కళ్యాణార్థం లలితా పారాయణం చేసినట్లు ఆలయ అర్చకులు మహేశ్వర్‌శర్మ తెలిపారు. సోమవారం అమావాస్య అరుదుగా వస్తుందన్నారు. అమావాస్య రోజున లలితా పారాయణం చేయడంతో కష్టాలు తొలగి సుఖ సంతోషలతో ఉంటారన్నారు.

జర్నలిస్టులకు మార్గనిర్దేశం చేయాలి

పాతమంచిర్యాల: జర్నలిస్టులకు నాయకత్వం వహించే సంఘాల నేతలు వారికి మార్గ నిర్దేశం చేయాలని బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్టు ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్‌కుమార్ అన్నా రు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో వర్కింగ్ జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా తయారయ్యాయని పేర్కొన్నారు. 80శాతం మంది జర్నలిస్టులకు వేతనాలు లేకుండా పోయాయని, అక్రిడేషన్‌లు, ఆరోగ్యభీమా, నివేశన స్థలాల విషయంలో అందరికీ న్యాయం జరుగాలన్నది తమ అభిమతమన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెన్నూర్: బెల్లంపల్లి పద్మశాలి భవన్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు కరాటే మాస్టర్ ఆర్.స్వామి తెలిపారు. కటా విభాగంలో జి.నెహా ప్రథమ, వై.శృతి ద్వితీయ, వి.శన్విత తృతీయ, స్పారింగ్ విభాగంలో స్నేహితకుమార్ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నెన్నెల/చెన్నూర్/దండేపల్లి/మందమర్రి రూరల్/భీమారం: నూతన సంవత్సర వేడుకలు ప్రజలంతా ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. చెన్నూర్‌లో సీఐ రవీందర్, మందమర్రిలో సీఐ శశిధర్‌రెడ్డి, నెన్నెలలో ఎస్సై ప్రసాద్, దండేపల్లిలో ఎస్సై ఉదయ్‌కిరణ్, భీమారంలో ఎస్సై శ్వేత సోమవారం విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డ్రగ్స్, అతిగా మద్యం తాగి న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి 12గంటల లోపు వేడుకలు ముగించుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవన్నారు. కేక్‌లను రోడ్లపై కట్ చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. 31వ తేదీ రాత్రి నుంచి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు వినియోగిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో నీరంతా వృథా..!



అశోక్‌నగర్ చౌరస్తా వైపు వెళ్లే మార్గంలో...


బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి అశోక్ నగర్ బస్తీలో అంతర్గత పైపులైన్ లీకేజీ జరిగి నీరంతా రోడ్డుపై వృథాగా పారుతోంది. సింగరేణి ఏరియా ఆసుపత్రి పక్క నుంచి వెళ్లే మార్గంలో పైపులైన్ లీకేజీ అవుతోంది. దాదాపు నెల రోజుల పైబడి నుంచి లీకేజీతో నీరు రోడ్డు పాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైపులైన్ నుంచి ఉపరితలానికి వస్తున్న నీరంతా అటు అశోక్‌నగర్ చౌరస్తాకు వెళ్లే మార్గంలో, ఇ టు మూసివేతకు గురైన కాల్‌టెక్స్ రైల్వేగేట్ మా ర్గంలో రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టి నీరు వృథాగా పోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొమ్మలు తొలగించరూ..!



భీమారం: మండల కేంద్రం నుంచి నెన్నెల మండల కేంద్రానికి గల ప్రధాన రహదారిలోని కొత్తగూడెం వద్ద చెట్లు రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుని ఆక్రమించిన చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వంగిన స్తంభం



దండేపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలోని వాగు వద్ద విద్యుత్ స్తంభం వంగి పడిపోయేలా ఉంది. వంగిన స్తంభం విద్యుత్‌సిబ్బంది, అధికారులకు కనిపించినా సరిచేయడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నా యి. ప్రమాదం జరగకముందే పట్టించుకో వాలని ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వంగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

పల్లెను తలపిస్తున్న బల్దియా

- అభివృద్ధికి నోచుకోని బెల్లంపల్లి మున్సిపాలిటీ
- పట్టణ సుందరీకరణను మరిచిన అధికారులు
- రోడ్ల వెంట, జనావాసాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని మున్సిపాలిటీ సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న 'పుర' ప్రజలు



అశోక్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ఏపుగా పెరిగి రోడ్డు మీదకు వచ్చిన తుమ్మ కొమ్మలు

బెల్లంపల్లి మున్సిపల్ స్వరూపం

మున్సిపల్ స్థాయి	-	బి-గ్రేడ్
వార్డులు	-	34
జనాభా	-	56,396

(2011 జనాభా లెక్కల ప్రకారం)

బెల్లంపల్లి: మున్సిపాలిటీ దినదినం అభివృద్ధి చెందాల్సి ఉండగా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. కార్మిక, కార్మికేతర వాడలు కలిసి ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఏర్పడినప్పటికీ గ్రామీణ ప్రాంత పరిస్థితులకు ఏమాత్రం భిన్నంగా లేకుండా ఉంది. రోడ్ల వెంట, జనావాసాల్లో పిచ్చి మొక్కలతో పరిసరాలు చిత్తడిగా తయారయ్యాయి. పేరుకు మున్సిపాలిటీ తప్పా, పల్లె ప్రాంతాల మాదిరిగానే ఉందనే విమర్శలు వస్తున్నాయి.

డివైడర్లలో మొక్కలు పెంచి..

మున్సిపాలిటీలో కన్నాల బస్తీ ఆర్టీసీ బస్టాండ్ క్రాస్ రోడ్ నుంచి బజారు ఏరియా, అంబేద్కర్ చౌరస్తా, ఏఎంసీ ఏరియా మీదుగా కాల్ టెక్స్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు, బాబుక్యాంపు బస్తీకి వెళ్లే బూడిదగడ్డ బస్తీ క్రాస్ రోడ్ నుంచి అశోక్‌నగర్ బస్తీ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు డివైడర్లను నిర్మించారు. వీటిలో బజారు ఏరియా ప్రాంతంలో మాత్రమే మొక్కలు పెంచారు. ఏళ్ల తరబడి నుంచి మొక్కల పెంపకం చేపడుతున్నా సరైన పర్యవేక్షణ లేక, సరిగ్గా నీటి తడులు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. వీటిలో పుష్పించే మొక్కలు లేకపోవడంతో నయనానందం కలిగించలేకపోతున్నాయి. పైగా శ్వాసకోశ సమస్యలను కలిగించే కోనో కార్పస్ మొక్కలు ఉండటంతో వీటిని నరికి వేయించాలనే డిమాండ్ వస్తుండగా ఇటీవల కొన్ని చెట్లను తొలగించారు. మరో పక్క అశోక్ నగర్‌కు వెళ్లే మార్గంలో డివైడర్ల మధ్య తుమ్మ ఇతర రకాల పిచ్చిమొక్కలు పెరిగాయి. అయినా మున్సిపల్ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

పేరుకుపోయిన దుమ్ము....

రోడ్లు, గల్లీల్లో దుమ్ముధూళి పేరుకుపోయి ఉంటోంది. నెలల తరబడి నుంచి రోడ్లపై శుభ్రపర్చడం లేదు. సరిపడినంతమంది పారిశుద్ధ్య సిబ్బంది లేక రోడ్లు ఊడ్వకుండా వదిలేస్తున్నారు. బస్తీల్లోని వీధులు, అంతర్గత రోడ్ల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా కనిపించడం లేదు. ప్రధాన రహదారులపై నిత్యకృత్యంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లన్నీ దుమ్ముతో నిండి ఉంటున్నాయి. పిచ్చిమొక్కలు పెరిగి, మరో పక్క దుమ్ము పేరుకుపోయి అధ్వానమైన పరిస్థితులు దాపురించాయి.

ఏ ప్రాంతంలో చూసినా...

మున్సిపాలిటీలో పట్టణీకరణ ఆనవాళ్లు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. అంతటా ఎందుకు పనికిరాని చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. కనువిందు కలిగించే పూల మొక్కల ఆనవాళ్లు కానరాకుండా పోయి కళావిహీనమైన పరిస్థితులు విరాజిల్లుతున్నాయి. కన్నాల బస్తీ, టేకుల బస్తీ, 24డీప్ ఏరియా, రవీందర్ నగర్, షంషీర్ నగర్, అంబేడ్కర్ నగర్, బెల్లంపల్లి బస్తీ, గోల్‌బంగ్లా బస్తీ, గొల్లగూడెం, గంగారాం నగర్, కాల్‌టెక్స్‌ఏరియా, రైల్వేస్టేషన్ ఏరియా, రైల్వే పెద్దనపలి బస్తీ, రైల్వే రడగంబాల బస్తీ, అశోక్‌నగర్, రాంనగర్, హన్మాన్‌బస్తీ, బాబుక్యాంపు బస్తీ, బూడిదగడ్డ బస్తీ, స్టేషన్‌రోడ్ కాలనీ, ఇంక్లైన్ రడగంబాల బస్తీ, నంబర్-2 ఇంక్లైన్ బస్తీ, సుభాష్ నగర్, శాంతిఖని బస్తీ, 65డీప్ ఏరియా తదితర ప్రాంతాల్లో, ఆ బస్తీలకు వెళ్లే రోడ్ల పక్కన, బస్తీల అంతర్భాగంలో, పరిసరాల్లో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు మున్సిపల్ పాలకుల పట్టింపులేని తనాన్ని వేలెత్తి చూపిస్తున్నాయి. మున్సిపాలిటీకి ఏటా రూ.కోట్లలో నిధులు మంజూరు అవుతుండగా పిచ్చి మొక్కల తొలగింపునకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పట్టణ సుందరీకరణను పట్టించుకోకుండా నిర్లక్ష్యాన్నీ ప్రదర్శిస్తున్నారనే విమర్శలు పురప్రజల నుంచి వెల్లు వెత్తుతున్నాయి.

తొలగింపు చర్యలు చేపడతాం



మున్సిపాలిటీలో ఎక్కడెక్కడ రోడ్ల వెంట, వీధులలో పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నాయో గుర్తించే చర్యలు తీసుకుంటాం. రెండు, మూడు రోజుల్లో మున్సిపల్ వ్యాప్తంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, ఇబ్బందికరంగా ఉన్న పనికిరాని చెట్లను తొలగిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీనివాసరావు,
మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్ అధ్యక్షతన సాదాసీదాగా ముగించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.71.28 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు అయ్యే అంచనా వ్యయంకు పరిపాలనా ఆమోదం తెలిపారు. వివిధ దినపత్రికల్లో ప్రచురించిన టెండరు ప్రకటన బిల్లులు రూ.1.31లక్షల బిల్లులను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ యండి మసూద్ అలీ, టౌన్ ప్లానింగ్ అధికారి బి.సంపత్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ టి.ఉదయ్ కిరణ్, యం.వైకుంఠం, వార్డు కౌన్సిలర్ పాల్గొన్నారు.

నేరాల నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: నేరాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. బెల్లంపల్లి అంబేడ్కర్ రడగంబాల బస్తీలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 24ద్విచక్ర వాహనాలను, ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రజల రక్షణ పోలీసుల బాధ్యతని అన్నారు. బస్తీల్లో ఎవరైన కొత్త వ్యక్తులు వచ్చినా, ఆశ్రయం పొందుతున్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని, యువకులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఉండే ప్రదేశాల్లో నార్కోటిక్ డాగ్‌తో పరిశీలించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంయూఎన్‌తో గ్రామీణ విద్యలో విప్లవాత్మక అడుగు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సుభాష్‌రెడ్డి

జన్నారం: విద్యార్థుల్లో ఉన్న మేధస్సు, నాయకత్వ లక్షణాలు, రాజకీయ చతురతను వెలికితీయడంలో భాగంగా నిర్వహించిన మోడల్ యూనైటెడ్ నేషన్ (ఎంయూఎన్) కార్యక్రమం గ్రామీణ విద్యలో ఒక విప్లవాత్మక అడుగు అని స్లేట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఏనుగు సుభాష్‌రెడ్డి, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్లేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన స్లేట్ ఎంయూఎన్-2024 వాలెడిక్టీ ఫంక్షన్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా లోక్‌సభ నిర్వహణ, పబ్లిక్ స్పీచ్, లీడర్‌షిప్ క్వాలిటీస్ ప్రపంచ మేధావుల వలే నిర్ణయాలు, లోక్‌సభ నిర్వహణలో, చైర్మన్, వైస్ చైర్మన్‌ల పాత్రలు నటించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్లోబల్, నేషనల్ సమస్యలను చర్చించి, తీర్మానాలను సూచించిన యువ డెలిగేట్లను ఏకతాటిపైకి తీసుకొచ్చిందని, మోడల్ యునైటెడ్ నేషన్ స్ఫూర్తి భౌగోళిక సరిహద్దులను దాటి గ్రామీణ ప్రాంతాలకు చేరిందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్లేట్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు శ్యామ్‌లాల్, షిరిన్ ఖాన్, డైరెక్టర్ రజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, గుడిసె వాసులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని రాజన్న కాలనీలోని గుడిసెల వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు, రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడెంకి చందు, సీపీఎం నాయకులు శ్యామల ఉమారాణి, సిడం సమ్మక్క, సరిత, శారద, రాజేశ్వరి, రమాదేవి, రేణుక, యామిని, సంధ్య, బూదక్క, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సయ్యకు ఆల్ ఇండియా నాలుగో ర్యాంకు

జన్నారం: మండలంలోని కలమడుగుకు చెందిన గంగధరి చంద్రయ్య, లక్ష్మీరాజవ్వ దంపతుల కుమారుడు లక్ష్మీనర్సయ్య జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌లో ఆల్‌ఇండియా నాలుగో ర్యాంకు సాధించాడు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో లిటరేచర్ విభాగంలో పరిశోధన కోసం జనవరి 3న అడ్మిషన్ తీసుకోనున్నట్లు తెలిపారు.

'అక్రమ మట్టిదందా వెంటనే ఆపాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనకాల ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా చేస్తున్న మట్టి తవ్వకాలను వెంటనే ఆపాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ జోత్స్నకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి తవ్వకాలు గత కొంతకాలం నుంచి నిరాటంకంగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫుడ్ ప్రాసెస్సింగ్ జోన్ పరిధిలో రోజువారీగా మట్టిని ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళ్లి రూ.లక్షలు కూడబెట్టుకుంటున్నారని తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న మట్టి దందాతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే కట్టడి చర్యలు తీసుకుని మట్టి దందాను నివారించాలన్నారు.

హెచ్‌ఎంఎస్ ఫిట్ సెక్రెటరీగా ఎస్‌కే వలి



జైపూర్: మండలం ఇందారం ఐకే1 గని హెచ్‌ఎంఎస్ ఫిట్ సెక్రెటరీగా ఎస్‌కే వలిని నియమించినట్లు హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఫిట్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర యూనియన్‌కు ఎస్‌కే వలి కృతజ్ఞతలు తెలిపారు.

గైర్హాజరు లేకుండా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

శ్రీరాంపూర్: యువ ఉద్యోగులు గైర్హాజరు లేకుండా పనిచేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి ఎస్కే బాజీసైదా తెలిపారు. శ్రీరాంపూర్ వీటీసీని సోమవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న యువ ఉద్యోగులను ఇంటర్నల్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఉద్యోగులను కలిసి మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. సంస్థలో యువ ఉద్యోగులే ఎక్కువ మంది పని చేస్తున్నారనిని, భవిష్యత్తు యువ ఉద్యోగులపైనే ఆధారపడి ఉందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు ఓసీసీ, అండర్ గ్రౌండ్ గనులు, సీహెచ్‌పీ, వర్క్‌షాప్‌లో ప్రాక్టికల్స్ వర్క్ చేయించి నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని యజమాన్యంను కోరుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచీ సహాయ కార్యదర్శి ఎం కొమురయ్య పాల్గొన్నారు.

పౌరులందరూ సమానత్వంతో జీవించాలి

దండేపల్లి/మందమర్రిరూరల్: పౌరులందరూ సుఖసంతోషాలు, స్వేచ్ఛ, సమానత్వంతో జీవించాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం మందమర్రి మండలం అందుగులపేటలో, దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.

చెరువు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం చెరువు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సంధ్యారాణికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

స్థలం కేటాయించాలని వినతి

చెన్నూర్: నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ అన్నారు. స్థలం కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ మల్లికార్జున్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాంలో విధులు నిర్వర్తిస్తున్న హమాలీ కూలీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎస్ పాయింట్ జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జనవరి 1న హమాలీల సంఘం ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్సై రాజశేఖర్ పిలుపునిచ్చారు. యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో చేపట్టిన 'మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం, బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం' అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, ఎస్సై రాజశేఖర్ పోస్టర్ ఆవిష్కరించారు.

సమస్యలు షీటీం దృష్టికి తీసుకురావాలి

మంచిర్యాలఅర్బన్: మహిళలు ఏ సమస్యలున్నా షీటీం దృష్టికి తీసుకురావాలని షీటీం సభ్యులు ప్రవీణ్‌కుమార్, జ్యోతి అన్నారు. కేజీబీవీలో సోమవారం మహిళా భద్రతపై అవగాహన కల్పించారు.

కార్మికులకు సబ్బులు, నూనెలు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సబ్బులు, నూనెలు అందించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

వరి విత్తనాలు పంపిణీ

దండేపల్లి: జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా దండేపల్లి వ్యవసాయ కార్యాలయం వద్ద దండేపల్లి, తానిమడుగు గ్రామాల రైతులకు ఆర్ఎన్ఆర్ 31479, కేఎన్ఎమ్ 12368 మినీకిట్ సన్నరకం వరి విత్తనాలను రైతులకు సోమవారం పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత భీమారం జట్టు

నెన్నెల: మండలంలోని కొత్తూర్‌లో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో సోమవారం జరిగిన తుది పోరులో నెన్నెల మండలం దుబ్బపల్లి జట్టుపై భీమారం జట్టు విజేతగా నిలిచింది.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట: ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్టీ) సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం సమర్పించారు.

పరామర్శ

బెల్లంపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు చిన్న కుమార్తె స్రవంతిని సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సన్మానం

మందమర్రిరూరల్: బెల్లంపల్లిలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో మందమర్రి పట్టణానికి చెందిన కొంపెల్లి రమేశ్ చాంపియన్‌గా నిలిచారు. సోమవారం పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన వ్యాపారస్తులు, శ్రేయోభిలాషులు రమేష్ దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

జైపూర్: మండలంలోని టేకుమట్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన జయశ్రీని స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్‌కు చెందిన బుడిగె రాజేశ్వరి-సమ్మయ్య దంపతుల కుమారుడు శివకుమార్ చార్టెడ్ అకౌంట్స్(సీఏ)లో ఉత్తీర్ణత సాధించాడు. కురుమ కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బండి రమాశంకర్ ఆధ్వర్యంలో సోమవారం శివకుమార్‌ను, తన పేరెంట్స్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నియామకం

జన్నారం: నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నల్లూరీ ఈశ్వర్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఈశ్వర్‌కు అందించారు.